క్లుప్తంగా

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

పాకాల: మండలంలోని పంటపల్లి, ఉప్పరపల్లిలో చేపట్టిన అమృత్ సరోవర్ పనులను సోమవారం జిల్లా తనిఖీ బృందం పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుందన్నా రు.

దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సత్కారం



కరమల వలీని సత్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: నూర్‌బాషా(దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి రూరల్ మండలం కుంత్రపాకం పంచాయతీకి చెందిన కరమల వలీ నియమితులయ్యారు. ఆయన సోమవారం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిశారు. ఆయన ను మోహిత్‌రెడ్డి సత్కరించి అభినందించారు. చంద్రగిరి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, పాల్గొన్నారు.

రూ.51 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పాకాల : మండలంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహానికి రూ.51 వేలను నామినేని సురేంద్రబాబునాయుడు, నామినేని ప్రమీలదేవి, డాక్టర్ మేడసాని రామమూర్తినాయుడు విరాళంగా ఇచ్చారు. వారిని జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, ఆలయ అర్చకులు కృష్ణమూర్తి శర్మ అభినందించి స్వామి వారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో చంటి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రామచంద్రాపురం: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని చంద్రగిరి సీఐ ఓబులేశు తెలిపారు. ఆయన సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు క్రమం తప్పకుండా ఇన్సూరెన్స్ చేయించాలని సూచించారు. ఈ క్రమంలోనే డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు సరిలేని వాహనాలకు జరిమానా విధించారు.

ఏసీలు వితరణ



తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడలోని మాతృశ్య అనాథాశ్రమంలోని పిల్లల సౌకర్యార్థం రైల్వే కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రే ఆఫ్ హోప్ ఎన్‌జీవో సంస్థ వ్యవస్థాపకురాలు అశ్విని సోమవారం రూ.1.30 లక్షల విలువైన రెండు ఏసీలు వితరణ చేశారు. పిల్లలకు ఫ్రూట్ జ్యూస్, బిస్కెట్స్ పంచిపెట్టారు. అశ్విని మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పిల్లల కోసం సంస్థ సభ్యులందరూ కలిసి నగదు పోగు చేసి ఏసీలను అందజేశామని తెలిపారు.

బారికేడ్ల వితరణ

తిరుపతి మంగళం: తిరుపతి–కరకంబాడి రోడ్డులోని భూపాల్ హౌసింగ్ కాలనీ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కార్పొరేటర్ హనుమంత్‌నాయక్ తెలిపారు. ప్రమాదాల నివారణకు గ్లోబల్ మార్కెటింగ్ సర్వీస్, శ్రీవేంకటేశ్వర గెలాక్సీ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత వెంకటరత్నం రెండు బారికేడ్లను వితరణ చేశారు. అలాగే సునీల్ డెవలపర్స్ అధినేత సునీల్ రెండు బారికేడ్లు అందజేశారు. వాటిని అలిపిరి పోలీసులకు అప్పగించారు.

ఎన్నారై కళాశాలపై ఫిర్యాదు

తిరుపతి అర్బన్: తిరుపతి ఎన్నారై కళాశాల ప్రతినిధులు గతంలో చెప్పిన దానికంటే ఎక్కువగా ఫీజు డిమాండ్ చేస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు సోమవారం హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు,బంధువులు మోహన్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి,మధుకర్ రెడ్డి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ ప్రతినిధులు చంద్రకళ, శశిరేఖ ముని బాబు తదితరులు పాల్గొన్నారు. విచారణ చేసి న్యాయం చేస్తామని అధికారులు వెల్లడించారు.

పేటశ్రీకి సీతారామమూర్తి స్మారక పురస్కారం



తిరుపతి తుడా: రచయిత పేట శ్రీనివాసులురెడ్డికి అద్దంకిలో ఆదివారం సీతారామమూర్తి స్మారక పురస్కారం అందజేశారు. అద్దంకి సాహిత్య పురస్కారం 2022 కవులు రచయితలకు అందజేశారు. ఈ సందర్భంగా స్మారక పురస్కారంతో పాటు యునెస్కో అవార్డుతో సత్కరించారు.

రైతుకు ఊతం ఆర్బీకేలు



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న అధికారులు (ఫైల్)



పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

- సీహెచ్‌సీతో రైతులకు పనిముట్లు
- అందుబాటులో ఎరువులు, పురుగు మందులు

పాకాల : ప్రజల ఆకలి తీర్చే రైతన్న బాగుంటేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని, ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధర అందుతుందో లేదో తెలియని పరిస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసింది. గ్రామంలోనే రైతులకు అన్ని విధాలా సహాయపడేలా చర్యలు తీసుకుంది. దీంతో వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి పండుగ అన్న భావన కలిగింది.

రాయితీతో పనిముట్లు

పాకాల మండలంలో 17 ఆర్బీకేలు ఉన్నాయి. 13 ప్రభుత్వ నూతన భవనాలు నిర్మించారు. మరో నాలుగు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 6,259 మంది రైతులు 5,460 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వీరికి వ్యవసాయంలో ఆదుకునేందుకు ప్రభుత్వం సీహెచ్‌సీ(కస్టమ్ హైరింగ్ సెంటర్లు)లు ఏర్పాటుచేసింది. ప్రతి పంచాయతీలోనూ రైతులకు 40 శాతం రాయితీతో యంత్రాలు అందజేస్తోంది. ఇందులో అర్హులైన రైతులు గ్రూపుగా ఏర్పడి రూ.15 లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలతో పాటు పనిముట్లు కొనుగోలు చేసుకునేలా చర్యలు చేపట్టింది. వీటిలో ట్రాక్టర్, రొటోవేటర్, స్ప్రేయర్, కల్టివేటర్స్, వంటి వాటితో పాటు అవసరమైనవి కూడా తీసుకోవచ్చు.

రైతులకు భరోసా

రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు పంటల సాగులో రైతులకు మెళకువలు తెలియజేస్తున్నారు. భూసార పరీక్షలు చేసి ఏయే పంటలకు ఏ మేరకు ఎరువులు, పురుగు మందులు వాడాలో తెలియజేస్తున్నారు. పంటలను ఆశించిన చీడపీడలను గుర్తించి నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు చేయించడంతోపాటు విపత్తుల్లో పంటలు దెబ్బతింటే పరిహారం అందేలా చూస్తున్నారు. అంతేగాక పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా 7,344 మంది రైతులకు రూ.6 వేల చొప్పున ప్రతి ఏటా రూ.4,40,64,000 అందజేస్తుంది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా 6,259 మంది రైతులకు రూ.7,500ల చొప్పున రూ.4,69,42,500 నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, యంత్ర సేవా పథకం, డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతు భరోసాను అందజేస్తోంది.

రైతు భరోసా ఎంతో ఉపయోగం



గతంలో పంటల సాగుకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి ఏటా రూ.13,500 ఇస్తుండడంతో ఇబ్బందులు తీరాయి. ఎరువులు, పురుగు మందులు స్థానికంగానే అందజేస్తున్నారు.

– ప్రతాపనేని ఆనంద చౌదరి, రైతు, మణిపిరెడ్డిపల్లి

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం



రైతుల కష్టాలను గుర్తించిన జగనన్న ప్రభుత్వం అండగా నిలబడింది. అక్కడ ఇక్కడ అని తిరిగే పని లేకుండా ఆర్బీకేల ద్వారా అన్నీ అందేలా చర్యలు తీసుకుంది. పంటలకు కావలసిన అన్ని పురుగు మందులతోపాటు ఎరువులు ఆర్బీకేల నుంచే అందజేస్తున్నారు.

– వి.రాజమ్మ, ఉప్పరపల్లి పంచాయతీ

స్థానికంగానే అన్ని సౌకర్యాలు



ప్రతి రైతుకూ అందుబాటులో ఉండేలా ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. పంచాయతీలో పక్కా భవనాలను నిర్మించి పంటల సాగులో మెళకువలు తెలియజేస్తున్నాం. రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీఏఏలు నిత్యం పంటలను పర్యవేక్షిస్తున్నారు. ఆర్బీకేల ఏర్పాటు మంచి ఫలితాలను ఇచ్చింది.

– పుష్పావతి. ఏఓ, పాకాల మండలం

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఉచిత వైద్య పరీక్షలకు విశేష స్పందన
- ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలి



చిట్టిచెర్ల వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

భాకరాపేట : చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశారని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ ఒంగుమళ్లవారిపల్లెలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.3000 విలువ చేసే వైద్య పరీక్షలను ఉచితంగా చేయడం మన అదృష్టమన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ఎమ్మెల్యే సంకల్పమన్నారు. డీఎల్‌డీవో సుశీలాదేవి మాట్లాడుతూ మన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎమ్మెల్యే రూ.లక్షలు ఖర్చు చేసి వైద్య పరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు పాకాల, ఎర్రావారిపాళెం మండలాల్లో వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. చిట్టేచెర్ల సచివాలయంలోని పరిధిలోని చిట్టేచెర్ల, దేవరకొండ పంచాయతీల్లోని ఒంగుమళ్లవారిపల్లె, దూదేవాండ్లపల్లె, తుమ్మచేనుపల్లె, చిట్టిచెర్ల, నగరి, భూతంవారిపల్లె సెంటర్లలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూప, సర్పంచులు నాగచెంగమనాయుడు, విజయ్‌కుమార్, ఎంపీడీవోలు దేవేంద్రబాబు, అమర్నాథ్, తహసీల్దార్ లోకేశ్వరి, వైద్యాధికారి శశికళ, ప్రజా ప్రతినిధులు భూపాల్, మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గురుశంకర్, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



జాయింట్ కలెక్టర్ బాలాజీతో సమావేశం అయిన చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీలకు చెందిన నిరుపేదలకు చిందేపల్లి జగనన్న లేఅవుట్‌లో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కోరారు. ఆయన సోమవారం జాయింట్ కలెక్టర్ బాలాజీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిందేపల్లి హౌసింగ్ కాలనీలో తిరుపతి రూరల్ మండలానికి చెందిన రెండు వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో స్థలం చూపించలేదని తెలిపారు. స్పందించిన జేసీ బాలాజీ హౌసింగ్ పీడీ, తిరుపతి రూరల్ తహసీల్దార్, చంద్రగిరి నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లేవుట్‌లో ఎందుకు పనులు ఆలస్యం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా ప్లాట్లు కేటాయించాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణం పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని, గృహ నిర్మాణానికి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

వ్యక్తిగత బాధ్యతతో ప్లాస్టిక్ వాడకం నియంత్రణ

తిరుపతి ఎడ్యుకేషన్ : పర్యావరణంపై స్పృహ, వ్యక్తిగత బాధ్యత కలిగి ఉండడం ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రివంచవచ్చని భూగర్భ జల, జలాల ఆడిట్ విభాగపు మాజీ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా సోమవారం ఆల్టర్నేటివ్స్ టు సింగిల్ యూస్ ప్లాస్టిక్స్ అన్న అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం అధికారిణి పి.నీరజ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి, బీసీడీఈ కోఆర్డినేటర్ కాత్యాయని, రజిని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు పద్మావతి, మాధవి శిరీష సుభాషిని పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి



విత్తనకాయలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ప్రసాద్‌రావు

రామచంద్రాపురం: ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న వేరుశనగ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ప్రసాద్ రావు తెలిపారు. ఆయన సోమవారం ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, ఏఓ స్రవంతితో కలిసి సీ రామాపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంటలను విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్ రెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ తాతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

పాకాల : మండలంలోని నేంద్రగుంట సమీపంలో గత నెల 27న ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ముంగిళిపట్టు నుంచి కె.అనిత అనే మహిళ పెనుమూరుకు వెళ్లడానికి నేంద్రగుంట సమీపంలో ఆటోలో వచ్చి దిగారు. రోడ్డు పక్కన నిలిచి ఉండగా సుబ్రమణ్యంనాయుడు ద్విచక్ర వాహనంలో వస్తూ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాది మృతి



జంషీద్ (ఫైల్)

తిరుపతి లీగల్ : తిరుపతికి చెందిన న్యాయవాది జంషీద్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యు లు తెలిపారు. ఆయన 2010 నుంచి తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అంతకుముందు సీనియర్ న్యాయవాదులు రామ్‌నాథ్, గౌస్‌అలీ వద్ద న్యాయవాది గుమస్తాగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి స్థానిక జడ్జీలు, న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు, ముస్లిం మైనారిటీ న్యాయవాదుల సంఘం కార్యవర్గసభ్యులు సంతాపం తెలిపారు.

డాక్టర్ పీసీ రాయలుకు ఘన సత్కారం



డాక్టర్ పీసీ.రాయలును సత్కరిస్తున్న అతిథులు, పలు సంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్, డాక్టర్ వైఎస్ఆర్ ప్రజా సేవా ప్రస్థానం చైర్మన్ డాక్టర్ పీసీ.రాయలు రాష్ట్ర స్థాయి దిశ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యా రు. ఆయనను సోమవారం గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి పాల్గొని మాట్లాడారు. పీసీ రాయలు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి దిశ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ సభ్యుడిగా నియమించడంపై అభినందించారు. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్, రాయలసీమ రంగస్థలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హ్యూమన్ రైట్స్, బ్రాహ్మణ సమాజం, పీసీఆర్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్, గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, అజయ్‌కుమార్, రుద్రరాజు శ్రీదేవి, జీఏల్.మనోహర్, బీఎస్.రెడ్డి, గుణశేఖర్ పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలు తొలగించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కు 13, స్పందనకు 25 ఫిర్యాదులు అందాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరీ రాధిక, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతులకు మోహిత్‌రెడ్డి నివాళి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారి ఇళ్లకు చేరుకుని మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుచ్చినాయుడుపల్లికి చెందిన బుచ్చిరెడ్డి గారి నాదముని రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం ఉదయం దహన సంస్కారాలు నిర్వహించారు. మోహిత్ రెడ్డి వారి నివాసం వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లయ్యపల్లి హరిజనవాడకు చెందిన టీటీడీ ఉద్యోగి వసంతమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతదేహంపై మోహిత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

తిరుపతి తుడా: రుయాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ కోరారు. ఆయన సోమవారం ఏఆర్ఎంవో డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డితో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభును కలిశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వసతులు కల్పిస్తోందన్నారు. వాటిని అందిపుచ్చుకొని ఆసుపత్రిని మరింత అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు.

8న అమిత్ షా, 10న జేపీ నడ్డా బహిరంగ సభలు

తిరుపతి గాంధీరోడ్: విశాఖపట్టణంలో ఈ నెల 8న అమిత్ షా, 10న శ్రీకాళహస్తిలో జేపీ నడ్డా బహిరంగ సభలు నిర్వహించనున్నట్టు బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొందరు స్థానికంగా సంక్షేమ పథకాల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. 2024 ఫిబ్రవరిలో పొత్తులపై క్లారిటీ వస్తుందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు బీజేపీ రాజకీయం తెలుస్తుందన్నారు. అప్పు డు కావాల్సిన వారిని అమిత్‌షా స్వయంగా కలు స్తారని పేర్కొన్నారు. నడ్డా, అమిత్ షాను చంద్రబాబు కలవడం వెనుక రాజకీయం ఉందనుకోవడం లేదన్నారు.

ట్రోఫీలతో క్రీడాకారుల బైక్ ర్యాలీ

పాకాల : చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ టోర్నమెంట్‌లో పాకాల మండలం ఇరంగారిపల్లికి చెందిన హిట్‌మెన్ లెవెన్స్ జట్టు మొదటి స్థానంలో, పాకాలకు చెందిన మున్నా లెవన్స్ జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు ట్రోఫీలతో సోమవారం ఇరంగారిపల్లి నుంచి పాకాల ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సెట్విన్ సీఈవో మురళీకృష్ణ



ఏఈలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఈ వాసురెడ్డి

తిరుపతి కల్చరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు వక్తలు తెలిపారు. ఎస్వీయూ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో ఆదివారం జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీయూ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి, యూపీ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ సిద్ధిరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ నరసింహం, ప్రొఫెసర్ బీవీ.మురళీధర్, ఎస్వీయూ పర్యావరణ విభాగం ప్రొఫెసర్ టి.దామోదరం హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు డిబేట్ నిర్వహించి ప్రతి భ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

తిరుపతి లీగల్ : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుపతి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళంలోని బాలుర పరిశీలనా గృహంలో జడ్జి సంధ్యారాణి మొక్కలు నాటారు. అలాగే బాలుర పరిశీలనా గృహంలో బాలురకు అందుతున్న ఆహార పదార్థాలు, వసతులను పరిశీలించారు.

మహిళా వర్సిటీలో..

తిరుపతి ఎడ్యుకేషన్:పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.రజని, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ విభాగాధిపతి డీఎం.మమత, ప్రొఫెసర్ జి.సావిత్రి, ఎ.సువర్ణలత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తిరుపతి తుడా: పర్యావరణ పరిరక్షణకు విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. కార్పొరేటర్లు బసవ గీత, నారాయణ, అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

జీవరాశులకు ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను బహిష్కరిద్దాం– పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చంద్రగిరి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో

చంద్రగిరి(తిరుపతి రూరల్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్పీడీసీఎల్ తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ వాసురెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రికల్ వాహనాలు వాడుతున్న సిబ్బందిని సత్కరించారు. కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. చంద్రగిరి డీఈ శేషాద్రి రెడ్డి, ఏఈలు నాగరాజు, హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.